# భార్య తెలివిగలదైతే!

**శ్రీ అక్కినేని గోపాలకృష్ణమూర్తి**

బజారునుంచి వస్తుంటే సినిమాహాలు వద్ద రమణరావు కనుపించాడు. మొదటి మామూలు మాటలవ్వగానే సిగరెట్ పెట్టితీసి సిగరెట్టొకటివ్వబోయాను. అతను వద్దన్నాడు. నాకొక పెద్ద ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లయింది. రమణరావంటే మాలోకెల్ల పెద్ద స్మోకర్. మాలో సగం పైగా అతని వద్దనుంచి నేర్చుకున్న వాళ్ళే. అందులో నేనూ ఒకణ్ణి. నా అనుమానం తీర్చుకునేందుకు మళ్ళీ అన్నాను "సిగరెట్"

"అక్కరలేదు" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"మానేశాను"

ఇంకా దీన్ని పొడిగించటం యిష్టంలేక వూరుకున్నాను. రమణరావు యీ వూరు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు, భార్యతో సహా రామానగరంలో వుంటున్నాడు. ఇదీ మా మిగిలిన సంభాషణ సారాంశము. మా సంభాషణాగమనంలో రమణరావు చాలా మారాడని కనిపెట్టాను.

తరువాత ఒకరోజున నేను భార్యాసమేతుడనై వాళ్ళింటికెళ్ళాను. కాఫీ తీసుకోగానే అలవాటు ప్రకారం సిగరెట్ వెలిగించాను. (రమణరావు చేత అక్కరలేదనిపించుకుని)

"ప్రక్కన కూర్చుని కూడా మొగుణ్ణి సిగరెట్లు కాల్చనిస్తున్నావా?" అంది రమణరావు భార్య నా భార్యతో.


"నేనేం చేస్తాను. మనం వద్దంటే మాన్తారా" అని మామూలుగా జవాబిచ్చింది కాంతం.

తరువాత రమణరావు భార్య కాంతాన్ని లోనకు తీసుకెళ్ళింది. రమణరావు నేనూ మా వూరి వ్యవహారాలు, యితర విషయాలు చాలా చాలా మాట్లాడుకున్నాము. పిలవగా, పిలవగా ఒక గంటన్నరకు కాంతం వాళ్ళు బయటకు వచ్చారు. వాళ్ళ మొఖాలు చూస్తే యింతసేపూ ఏదో సీరియస్సైన వ్యవహారమే మాట్లాడినట్లున్నారు. మీరూ అప్పుడప్పుడొస్తుండండని చెప్పి కాంతం నేనూ మా యింటికొచ్చేశాము.

రెండవరోజున సోఫాలో కూర్చుని మామూలుగానే సిగరెట్ ముట్టించటానికి అగ్గిపుల్ల వెలిగించాను. ప్రక్కనే కూర్చున్న కాంతం దాన్ని "ఊఫ్" అని వూది ఆర్పేసి "ఇప్పుడు మిమ్మల్ని సిగరెట్టు కాల్చనివ్వను" అంది దృఢ నిశ్చయురాలైనట్లు. నేను మళ్ళీ అగ్గిపుల్ల గీశాను. మళ్ళీ ఆర్పేసింది. ఎలాగయితేనేం యీసారి ఒక ప్రక్కకు తిరిగి సిగరెట్ ముట్టించాను. ఈ సిగరెట్టును నోటిదగ్గరకు రానీయకుండా నోటికి చెయ్యి అడ్డము పెట్టటము మొదలయిన ప్రయత్నాలు చేసింది. కాని యీసారి కాంతం విజయవంతురాలు కాలేదు.

నేనేదో విధంగా పొగ పీలుస్తూనే వున్నాను. ఇక విసుగుపుట్టి సిగరెట్ లాక్కుని బయట పారేసింది. నేనింకో సిగరెట్ తీయబోయాను. కాని వీలు చిక్కలేదు. నేను మంచంమీది కెళ్లాను. కాంతంకూడా నావంటే! కాంతకు యిష్టం లేకుండా త్రాగటం కష్టమైన విషయమే! కాని మానివేయటం మరింత కష్టమైన పని (అందులో భోజనం చేసిన తరువాత.) "ఈ ఒక్క సిగరెట్ కాల్చుకోనియ్యి కాంతం" అన్నాను బతిమాలుతున్న స్వరంతో. "నాచేత్తో యిస్తాను తెండి" అని సిగరెట్ తీసుకుని నా నోటికందించి అగ్గిపుల్ల గీసి ముట్టించింది. "ఇక మీకెప్పుడైనా సిగరెట్ కావలిస్తే నాచేత్తోనే యిస్తాను" అంది కాంతం. నా కప్పటిదొక భాగ్యం.

ఇక నాకు సిగరెట్ కావాలిస్తే కాంతాన్ని పిలిచి సిగరెట్టిచ్చి, మళ్ళీ

# ఫోనిక్సు పంకాలు

**(A. C. & D. C.)**

సోల్ ఏజెంట్లు:

RM. S. & Co., Ltd, 16, Broadway, MADRAS.

విశాఖపట్టణం అండ్ తూర్పుగోదావరి జిల్లాలకు ఏజెంట్లు:—

మెస్సర్సు మాక్‌డవెల్ అండ్ కంపెనీ లిమిటెడ్.

విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను


యిప్పించుకుని కాల్పించుకోవాలి. ఒకవేళ నేనే ఎప్పుడైనా సిగరెట్ ముటించుకుని కాలుస్తున్నప్పుడు కాంతం చూస్తే ఎలాగో లాగు లాక్కుని బయట పారేసేది. రాను రాను సిగరెట్లని కాంతం హేండోవర్ చేసుకుంది. నాకు సిగరెట్ కావలిస్తే కాంతాన్నడగాలి. అయినా పెద్ద బాధని పించలేదు. ఎందుకంటే అడగ్గానే యిస్తుండేది. పైగా తనే సిగరెట్టు వెలిగించటంలో కొంత కొత్తదనం, ఆనందం వుంటోంది. ఆఫీసులో నేనే ముట్టించుకు కాల్చినప్పుడు అంత తృప్తిగా వుండేదికాదు. రానురాను కొన్ని అబ్జక్షన్స్ రైజ్ చేస్తోంది. "యిప్పుడే గదండి కాల్చింది, గంట కొకటికంటే ఎక్కువ యివ్వను. సరే! ఒక గంటవరకు అడగకండి ఇదిగో మీకు ముప్పావు సిగరెట్టే యిస్తాను" అని సిగరెట్టు విరిచి మిగిలిన మూడవ భాగం పారేస్తుండేది. రానురాను దీని పరిమాణం తగ్గుతూ వచ్చింది. కావల్సినప్పుడల్లా ఒక ముక్కివ్వటం రెండు పీల్పులు పీల్చి అవతల పారేయటం. ఆఫీసులో నిండు సిగరెట్ త్రాగాలంటే అప్పుడప్పుడు విసుగు కూడా పుట్టేది (అందులో సొంతంగా ముట్టించుకోవటం.)

మూడు నెలలకు సిగరెట్లు కాలవటం చాలావరకు తగ్గిపోయింది. ప్రొద్దున భోంచేయగానే ఒక అర సిగరెట్టు; మధ్యాహ్నం ఆఫీసులో ఒక నిండు సిగరెట్టు, రాత్రి భోంచేయగానే ఒక అర సిగరెట్టు. అంతే!

ఒకరోజు ప్రొద్దున భోంచేశాక కాంతం సిగరెట్టుతెచ్చి నోట్లో పెట్టి అంటించింది సిగరెట్ అంతా నలిగిపోయి వుంది. లోపల పొగాకు తీసి, మళ్లీ కూరినట్లుంది. రుచి, వాసనా కూడా ఏం బాగాలేదు. "ఇదొద్దు యింకోటియ్యి కాంతం" అన్నాను. "ఇక లేవండి. తెప్పించలేదు. మధ్యాహ్నం తెప్పించాలి" అంది. ఆ సిగరెట్ పూర్తి చేసేసరికి కళ్లు తిరగటం వాంతులు రావటం అన్నీ జరిగినై. తరువాత నాలుగు రోజులు జ్వరం. ఒట్టి తలకాయనొప్పి వస్తేనే భయపడే కాంతం ఏమీ భయపడినట్లు కనుపించలేదు. తరువాత వారం రోజులకు భోంచేసి వచ్చి పడుకుంటే ఏదో మర్చిపోయినట్లు ఫీలయ్యాను. కాంతంవచ్చి ప్రక్కన కూర్చుని తల నిమురుతూ "యిక సిగరెట్లు మానేయండీ" అంది. ఆ సిగరెట్లమాట వినిపించగానే వారం రోజుల క్రితం జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. "ఛీ, ఛీ సిగరెట్లంటే ఎంత అసహ్యం. అసలీ త్రాగేవాళ్ళంతా ఎందుకు త్రాగుతారు?" అనుకున్నాను.

రోజూ భోంచేయగానే కాంతం వచ్చి తియ్యటికబుర్లు చెప్తుండేది.

నాకు జ్వరం వచ్చిందని తెలిసి రమణరావు భార్యతోసహా వచ్చాడు. వస్తూనే రమణరావు భార్య అన్నది "ఏమమ్మా! మీ ఆయన సిగరెట్లు పూర్తిగా మానేసినట్లేనా?" అని. తరువాత వాళ్లిద్దరు లోనకెళ్ళారు. మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాము. రమణరావుకు చూపిద్దామని మొన్న తెచ్చిన క్లాత్ కోసం ప్రక్క రూమ్‌లోకి వెళ్ళాను. రమణరావు భార్య గొంతు స్పష్టంగా వినిపించింది. "సిగరెట్లలాగానే యింకొంచెము తెలివిగా డబ్బు కూడా హేండోవర్ చేసుకుంటే చాలా ఖర్చులు తగ్గించవచ్చు!" ★



మామూలుగానే సిగరెట్ ముట్టించడానికి అగ్గిపుల్ల గీశాను. వెంటనే కాంతం ఉఫ్ అని ఊదేసింది.